

రాష్ట్ర స్థాయి సెమినార్‌ను జయప్రదం చేయండి

కడప అర్బన్ : వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభంపై ఈ నెల 16న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ హాల్ లో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఏ గోపాలకృష్ణయ్య తెలిపారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం ఏమాత్రం గిట్టుబాటు కాలేదని పేర్కొన్నారు. సాగుకు పెట్టుబడికి అయ్యే ఖర్చులు కూడా ఇవాళ అందలేదని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కలేదని, దళారుల వ్యవస్థతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం చాలా అన్యాయమని తెలిపారు. సెమినార్‌కు రైతు సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు.

'సాగర్' పెండింగ్ పనులకు ప్రాధాన్యత

- రూ.57 కోట్లతో లీకేజీ పనులకు ప్రతిపాదన
- కుందూ-పెన్నా ఎత్తిపోతలతో ఆయకట్టు స్థిరీకరణ
- తెలుగుగంగ ఎస్ఇ శారద వెల్లడి

బ్రహ్మసాగర్ పెండింగ్ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రూ.57 కోట్లతో టిజిపి కెనాల్ మరమ్మతుకు ప్రతిపాదనలు అందజేశాం. 1.56 లక్షల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించేందుకు అవకాశం ఉంటుంది. కుడి, ఎడమకాల్వ పనులకు టెండర్లు పిలిచాం. ఎడమ కాల్వ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. టిజిపి కాల్వల పనుల్ని వేగవంతం చేశాం. వెలుగోడు నుంచి 1600 క్యూసెక్కులు సరఫరా అవుతోంది. పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేసే అవకాశాలు ఉన్న కారణంగా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడంపై దృష్టి సారించే అవకాశం ఉందని తెలుగుగంగ ఎస్ఇ ఓ.శారదతో ప్రజాశక్తి ముఖాముఖి...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖాముఖి..

బ్రహ్మసాగర్ నీటి నిల్వ సామర్థ్యం ఎంత?

బ్రహ్మసాగర్ 17 టిఎంసిలను నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 15.01 టిఎంసిలు నిల్వ ఉంది. కుందూ-పెన్నా ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది.

బ్రహ్మసాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మసాగర్ కింద 1.56 లక్షల విస్తీర్ణం ఉంది. ఇందులో 56 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన లక్ష ఎకరాల ఆయకట్టు ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది.

సాగర్ ఆయకట్టు ప్రాంతాల వివరాలు తెలపండి?

బ్రహ్మసాగర్ ఆయకట్టు బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాల పరిధి లోని పలు మండలాల్లో విస్తరించి ఉంది. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బద్వేల్ నియోజకవర్గంలోని బద్వేల్, పోరు మామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండలాలన్నీ కవర్ అవుతాయి.

కుడి, ఎడమ కాల్వ లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతం పురోగతి కొనసాగుతోంది. నాలుగు దఫాలుగా పిలిచిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుని పనులు చేపడుతోంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో 700 మీటర్ల అక్విడక్టు పనులు చేపడితే అట్లూరు మండలంలోని ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

బ్రహ్మసాగర్ లీకేజీ మరమ్మతు ఎంత వరకు వచ్చింది?

బ్రహ్మసాగర్ లీకేజీ పనులకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. ఇక్కడి నుంచి ముందుకు వెళ్లడానికి పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తిం చడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది.

తెలుగుగంగ కాల్వ మరమ్మతు పనులెప్పుడు చేపడతారు?

తెలుగుగంగ కెనాల్ మరమ్మతు నిమిత్తం రూ.50 కోట్లతో ప్రతి పాదనలు పంపించాం. రాష్ట్రప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడతాం. ఫలితంగా తెలుగుగంగ కాల్వకు పూర్తిస్థాయిలో ఐదు వేల క్యూసెక్కుల నీటి పరిమాణాన్ని సద్వినియోగం చేసుకునే అవ కాశం ఉంటుంది. ఫలితంగా రెండు వారాల్లో బ్రహ్మంసాగర్ పూర్తి స్థాయిలో నిండిపోయే అవకాశం ఉంది.

కుందూ-పెన్నా లిఫ్టు పనుల పురోగతి ఎలా ఉంది?

కుందూ-పెన్నా ఎత్తిపోతల పనులు పురోగతిలో ఉన్నాయి. 56 ఎకరాల భూసేకరణ ప్రక్రియ అనంతరం కుందూ-పెన్నా ఎత్తిపోతల పనులు ఊపందుకునే అవకాశం ఉంది. లిఫ్టు పనులను పూర్తి చేసిన అనంతరం ఎనిమిది టిఎంసిలను ఎత్తిపోసే అవకాశం ఉంది.

బ్రహ్మసాగర్ సర్‌ప్లస్ గేట్ ఏర్పాటు ఎప్పుడు?

బ్రహ్మసాగర్ సర్‌ప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభించాల్సి ఉంది.

గోపవరంలో జగనన్న టౌన్‌షిప్!

మూడు కేటగిరీల కింద ప్లాట్లు
358 ప్లాట్ల ఏర్పాటుకు కసరత్తు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ఆధ్వర్యంలో బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరంలో జగనన్న టౌన్‌షిప్ ఏర్పాటు కానుంది. గోపవరం రెవెన్యూ పొలంలోని 1755-1, 1755-2, 1755-4 నుంచి 1755-6, 1755-11756-5, 1759-5, 1760-1, 1759,-5, 1760, 1760-1, 1760-3,1760-5 నుంచి 1760-7 వరకు గల 32.42 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్ ఏర్పాటు కానుంది. ప్రభుత్వం జిఒ ఎం.ఎస్ నెంబర్ 76 విడుదల చేసింది. మధ్యతరగతి ప్రజలు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని లేఅవుట్లను ఏర్పాటు చేయాలని మెమోను జారీ చేసింది. తక్కువ రేట్లతో 358 సొంత ప్లాట్లను ఏర్పాటు చేయడానికి అనుమతించింది. విశాలమైన వాతావరణం, 60 అడుగుల మేరకు విశాలమైన రహదారులతో కూడిన లేఅవుట్లను ఏర్పాటు చేయాలని పబ్లిక్ హెల్త్, అండ్ లేఅవుట్ ఎగ్జిక్యూటివ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. 60 అడుగుల మేర విశాలమైన రోడ్లు, 40 అడుగుల కాంక్రీట్ రోడ్డు, కలర్ ఫుల్ టైల్స్ ఫుట్‌పాత్‌లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఐఐపి ఎల్ఎస్ఆర్‌తో నీటి సరఫరా వ్యవస్థ, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, భూగర్భ మురుగు కాలువ పైప్‌లైన్స్, నాణ్యమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, వీధిలైట్లు మొదలగు సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. పార్కులు, ఆటస్థలాల అభివృద్ధికి డైరెక్టర్ ఆఫ్ టౌన్ షిప్, కంట్రీ ప్లానింగ్‌పై దృష్టి సారించింది. ఇందులో ఎంఐజి-1 కింద 150 స్వేర్‌ఫీట్ల చొప్పున 62 పాట్లు ఎంపైజి-2 కేటగిరీ కింద 200 స్వేర్‌ఫీట్లతో 156 ప్లాట్లు, ఎంఐజి-3 కేటగిరీ కింద 240 స్వేర్ ఫీట్లతో 114 ప్లాట్లను ఏర్పాటు చేయనుంది. కేటగిరీల్లో స్థానికంగా ఉన్న కుటుంబానికి ఒక ప్లాట్ చొప్పున కేటాయించనుంది. ఏడాదికి రూ. 18 లక్షలలోపు ఆదాయ పరిమితి కలిగి ఉండాలి. ఆసక్తికలిగిన వారు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తు నమోదైన అనంతరం లాటరీ పద్ధతి ద్వారా అర్హులకు ప్లాట్లు కేటాయించ నున్నారు. మూడు నెలల గడువు ముగిసిన అనంతరం ఆడా సమీక్ష చేసిన అనంతరం ప్లాట్ కేటాయింపును రద్దు చేసే అవకాశం ఉంది. దరఖాస్తు సమయంలో చెల్లించిన 10 శాతం నగదును కోల్పోవడంతో పాటు అదనంగా మరో 10 శాతం వెరసి 20 శాతం నగదును వడ్డీని కోల్పోవలసి ఉన్నట్లు తెలుస్తోంది.



విభజన హామీలను ప్రస్తావించని సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న ఆమూరి బాలదాసు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విభజన హామీలను ప్రస్తావించని పరిస్థితి కనిపించిందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రధానమంత్రి బహిరంగ సభలో విభజన చట్టంలోని హామీలైన ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, రైల్వే జోన్, పోలవరం నిర్మాణం హామీలను పేలవంగా ప్రస్తావించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. జగన్ రెడ్డి జిల్లాకు ఒక వైద్య కళాశాల మంజూరు చేసి శంకుస్థాపనకే పరిమితమై ఇంతవరకు నిర్మాణాలు చేపట్టకపోవడం శోచనీయమని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నగరఉపాధ్యక్షులు న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రెటరీ బసిరెడ్డి రమణారెడ్డి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నబికోటు శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షులు నాదెల్ల దస్తగిరి మూడవ డివిజన్ జి శ్రీనివాసులు తప్పెట్ల శేఖర్ ల్గొన్నారు.

సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలి

పోరుమామిళ్ల : జీవిత కాలం పాటు ప్రజలకు, ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణానంతరం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత, వెంటనే సిపిఎస్ రద్దు హామీని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి. రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్‌టియు భవనంలో రీజనల్ కన్వీనర్ కె.పుల్లయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ అధికారంలోనికి వచ్చిన వారంలోపు రద్దు చేస్తామని చెప్పిన హామీని ఇంతవరకు అమలు చేయ కపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలరాజు, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి జిల్లా నాయకులు విజయభాస్కర్, శివారెడ్డి, రవీంద్రబాబు, రాజగోపాల్, మండలనాయకులు సుబ్రమణ్యం, కుమార్ బాబు, శ్రీనివాసులు, వెంకటరెడ్డి,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - కడప



ర్యాలీలో పాల్గొన్న జడ్జి, విద్యార్థులు

జాతీయ న్యా యసేవా అధికార సంస్థ ఆదేశానుసారంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ సూచనల మేరకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సందర్భంగా పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్యక్ర మాలు 15 రోజులపాటు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం పాన్ ఇండి యా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కవిత ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటరీలతో జిల్లా కోర్టు ఆవరణం నుండి ఆర్‌టిసి కూడలి వరకు ర్యాలీని నిర్వహించారు. మరొక ర్యాలీ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం నుంచి మరియాపురం వరకు నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లుసిబ్బంది పాల్గొన్నారు. **కోర్టు ఆవరణలో** దోమ కాటు వల్ల సంభవించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి విష జ్వరాలు సంభవించకుండా కోర్టు ఆవరణలో ఆదివారం లార్వా సర్వే నిర్వహి ంచారు. ఆశ వర్కర్లు సి. లక్ష్మి దేవి, మాధవి, ఎఎన్ఎం సుమలత కోర్టు ఆవర ణలోని తొట్లలో, పాత డబ్బులలో నిల్వ ఉన్న వర్షపు, మురుగునీటిని తొలగి ంచారు. కోర్టు ఆవరణమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా నాగరాజు పేట డాక్టర్ బషీర్ అహ్మద్ సూచించారు.

పారిశుధ్యంపై అవగాహన

కడప : ఆశారేఖ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు ఆదివారం కడప పరిసర ప్రాంతాలైన ఆజాద్ నగర్, సరోజిని నగర్, తదితర మారుమూల పల్లెల్లో వినూత్న రీతిలో చరణ్ అనే బాలుడితో అపరిచితుడు వేషం వేయించి ప్లాస్టిక్ నివారణ, పారిశుధ్య అవగాహన ప్రచారం చేశారు. ఇంటి సరుకుల కోసం బయిటికొచ్చేవారు తమతో ఒక బ్యాగును వెంటతీసుకెళితే ప్లాస్టిక్ కవర్లను అరికట్టవచ్చని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వల్లూరు : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెహ్రూ యువ కేంద్ర వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ జూటూరు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారిని నసీం మునిషా మాట్లాడుతూ బాలల దినోత్సవం పురస్కరించుకొని వ్యాసరచన పోటీల్లో ఫలితాలను సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇమామ్‌బాషా

తెలుగు, ఆంగ్ల మీడియం పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని రూట రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. అబ్దుల్ వారిస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని షాహి దర్బార్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం కాకుండా రెండో అధికార భాష ఉర్దూను ప్రతి విద్యార్థికీ చేరవేయాలని పేర్కొన్నారు. సభ కు గౌరవ అతిథిగా హాజరైన రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠశాలల, కళాశాలల అభివృద్ధికి సహకరించాలన్నారు. రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ ఇమామ్ బాషా మాట్లాడుతూ ఉర్దూ అంగన్ వాడి కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఉర్దూ విద్యా సంస్థల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమీ అవార్డులు పొందిన హాషిం, షబ్బీర్ బాషా, గఫూర్, తస్నీమ్, ఎహ్సానుల్లా ఖాన్, ఇలియాస్ ఖాన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం రూట నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా కు రూట నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యల పై వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ నాయకులు అబ్దుల్ మునాఫ్ , సయ్యద్ ముష్తాక్, ఖలందర్ బాషా, అబ్దుర్రకీబ్, షాహిదుల్లా, డాక్టర్ వసీవుల్లా సాహెబ్ ,అసదుల్ల బాషా, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఇలియాస్ బాషా, సనావుల్లా, అధిక సంఖ్యలో ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు రెండు కళ్లు

- ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు తనకు రెండు కళ్లు లాంటి వారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం. వి. రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సాయిబాబా విద్య సంస్థలలో ఉపాధ్యాయ సంఘాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డితో పాటు 34 ఉపాధ్యాయ సంఘం నాయకులు హాజరయ్యారు. లెక్కల జమాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తక వ్యవహరించి తన వంతు బాధ్యతగా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటానని పేర్కొ న్నారు. సంస్థల పరిష్కారంలో ముందు ఉంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, గురుకుల, ఏయిడెడ్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సు అందరూ ఉద్యోగుల మాదిరిగానే 62 సంవత్సరాల పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, వైఎస్ఆర్‌టిఎఫ్ రాష్ట్ర సమీక్ష అధ్యక్షులు రమణారెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పిఎస్‌టిఎ జిల్లా అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి, కెజిబివి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాధాదేవి ప్రగతిశీల మున్సిపల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్, వివిధ మండల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాలు

చెన్నూరు : కడప- కర్నూల్ జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డు మీద కడపకు పోయే దారి వద్ద ఆటోలు రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరులోని మీసేవ, దుకాణాల వద్ద, హోటల్లో వద్ద ఆటోలను, స్కూటర్లు రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉంచి వారి పనుల కోసం వెళ్లిపోవడంతో మిగతా వాహన రాకపోకలకు అంతరాయంగా మారింది. పైగా ట్రాఫిక్ స్తంభించి పోతోంది. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు, వాహనాల వెళ్లే విద్యార్థులు సైతం అవస్థలు పడుతున్నారు. చెన్నూరు కొత్త రోడ్డు పైన ఆటోలు, పెద్ద వాహనాలు అడ్డంగా పెట్టడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి రోడ్డుకు అడ్డగంగా ఉంచిన వాహనాదారులపై చర్యలు తీసుకోవాలనిస్థానికులు కోరు తున్నారు.

అత్యధిక ధర సాధించిన పట్టు గూళ్లు

కడప అర్బన్ : మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్లో కడపకు చెందిన పట్టుగూళ్లు అత్యధిక ధర సాధించిందని జిల్లా పట్టు పరిశ్రమల అధికారి నరసింహా రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటసుబ్బయ్య అనే రైతు సుమారు 200 పట్టు గుడ్లను కొనుగోలుచేసి 150 కిలోల పట్టుగూళ్లను సాధించారని పేర్కొన్నారు. కిలో పట్టుగూళ్లు రూ. 750 ధర పలికిందని తెలిపారు.

ఎన్ని కేసులైనా పెట్టుకోండి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి నాయకుల పై ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో పోలీసుల ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఐదు రోజుల నుంచి నుంచి జరుగుతున్న పరిణామాలపై, పోలీసులు వ్యవహరిస్తున్న తీరును గమనిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్ష ధోరణిగా, అధికార పార్టీ నాయకులకు భూ కబాదారులకు తొత్తులుగా కొంత మంది పోలీసులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తమ్ముడు అహ్మద్ బాషా నాలుగు సెంట్ల స్థలం కోసం కొంతమంది రౌడీలతో టీడీపి పార్లమెంట్ నగర కార్యదర్శి జమీల్, తమ్ముడి పైన కట్టెలతో, రాడ్డులతో దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలో రాయచోటి నియోజగవర్గ ఇన్‌చార్జి రమేష్ రెడ్డి మీద అక్రమంగా కేసులు పెట్టారని తెలిపారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. అన్ని గుర్తు పెట్టు కుంటామని, సరైన సమయంలో సరైన జవాబు చెపుతామని పేర్కొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటి బాలలే రేపటి పౌరులని కేథడ్రల్ చర్చి విచారణ గురువులు బిరుసు రాజా పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మరియాపురంలో గల కేథడ్రల్ చర్చిలో ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం విచారణ గురువులు పిల్లలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ చంద్ర, కన్య స్త్రీలు, ఉపదేశిలు, విశ్వాసులు, చిన్నారులు అఖిల, ఏంజెల్ స్వీటీ, సిరిల్, సోనీ, బాల బాలికలు పాల్గొన్నారు.


ముస్తాబైన జిల్లా కేంద్ర గ్రంథాలయం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయం వారోత్సవాలకు ముస్తాబైంది. గ్రంథాలయ భవనాన్ని రంగుల కాగితాలతో కళ కళ లాడుతుంది. సాయంత్రం విరజిమ్మే విద్యుత్ కాంతులతో శోభయమానంగా మారింది. బాలల దినోత్సవం రోజున బాలల కోసం కావాల్సిన ఏర్పాట్లు అన్ని సిద్ధం చేసుకుంది. ప్రముఖుల చేత జెండా ఎగురవేయటం, జవహర్ లాల్ నెహ్రూ, స్వాతంత్ర్య సమర యోధులను, గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసినటువంటి ప్రముఖులను గుర్తు చేసేలా వేషధారణ పోటీలకు స్టేజి ఏర్పాటు చేశారు. పిల్లలకు నిజంగా పండగ వాతావరణం ఉండేలా జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైసిపి ఆరాచకాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

అధికార వైసిపి చేసే అరా చకాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని టిడిపి మండల కన్వీనర్ టక్కోలి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కమలాపురం ఎస్‌సి సెల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుల్లగూర శ్రీనివాసులు ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండల ఎస్‌సి సెల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూడు ఏళ్లుగా రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. నిత్యావసర వస్తువులతో పాటు అన్ని రంగాల పైన అధిక ధరలు పెంచడంతోపాటు ప్రజల పైన అనేక భారం మోపుతున్నారని అన్నారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. కమలాపురం నియోజకవర్గం లోని అన్ని దళిత కాలనీలలో సమావేశాలు ఏర్పాటు చేసి దళిత ప్రజలను చైతన్య పరుస్తామని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. ఎస్‌సిసెల్ అధ్యక్షునిగా కమ్మటి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా గుర్రాల రెడ్డన్న, కాంపల్లె చిన్నోడు, ప్రధాన కార్యదర్శులుగా జల్లి నాగేంద్ర, వేల్పుచర్ల గణపతి నాగేంద్రప్రసాద్, కార్యదర్శిగా అరవ దాసరి రామకృష్ణ, కోశాధికారుగా బుస్సా పుల్లయ్యతో సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు ముద్దనూరు బాష, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి టుంకూరు రామాంజనేయులు, కమలాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి, చెన్నూరు రాంప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి కొండాల చెన్నయ్య, నియోజకవర్గ ఎస్‌సిసెల్ ఉపాధ్యక్షులు ఎం ప్రసాద్, మామిళ్ళపల్లె ఎస్‌టి సెల్ నాయకులు రాము నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా జెండా ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని హోమియోపతి కళాశాల దగ్గర ఉన్న ఎఎస్ఆర్ నగర్‌లో హజరత్ దస్తగిరి సాహెబ్ జెండా ఉత్సవాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పవిత్రమైన గ్యార్మి షరీఫ్ మాసాన్ని పురస్కరించుకొని జెండా ఉత్సవాలు నిర్వహించామని చెప్పారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాదీ జెండా పండుగ నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జెండా మెరవణిని ఫకీర్ల మేళ తాళ్లతో పుర విధులలో ఊరేగింపుగా నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి జెండాను అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు షేక్ మహబూబ్ బాషా, షేక్ టి బాష, షేక్ మస్తాన్ వలి, యాత్రికులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్క రించేందుకు తక్షణమే కృషి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నకాష్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వివరించారు. నగరంలో 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయని, వీటిలో అనేక రకాల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. నగరంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇటీవల బదిలీపై డాక్టర్ల స్థానంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను నియామకం చేపట్టి తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లాగానే పట్టణ ఆరోగ్య కేంద్రంలోనూ 126 రకాల జబ్బులకు అవసరమైన మందులను ప్రజానీకానికి అందుబాటులో ఉంచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నకాష్, అక్కాయపల్లె, అగాడి, కట్టకింద హరిజనవాడ, నాగరాజుపేట, అక్కాయపల్లె ప్రాంతాల్లో డాక్టర్ల పోస్టులను తక్షణమే నియ మించాలని డిమాండ్ చేశారు. నకాష్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రంలో నూతన యం త్రాలు ఉన్నా ఏసీ సౌకర్యం లేకపోవడం వల్ల వాటిని వినియోగించడం లేద`న్నారు. తక్షణమే ఏసి ఏర్పాటు చేసేలా అవసరమైన చర్యలు తీసుకొని విని యోగంలోకి తీసుకోవాలని కోరారు. కాంపౌండ్ ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, షాకీర్ పాల్గొన్నారు.

నూర్‌బాష సంఘం అధ్యక్షులుగా రాజకిషోర్‌బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

ది కడప జిల్లా నూర్‌బాష సంఘం (దూదేకుల) నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఆదివారం ఎర్రముక్కపల్లెలోని సంఘం కార్యాలయంలో అధ్యక్షులు జి.రాజకిశోర్‌బాబు అధ్యక్షతన నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.బాదుసా సాహెబ్, పి.ఓబులేసు, జిల్లా అధ్యక్షులుగా రిటైర్డ్ ఎస్‌పి రాజకిషోర్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.ఖాదర్‌బాష, ఎ.వెంకట ప్రసాద్, ఇమాం, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుభాన్, నజీర్, ప్రధాన కార్యదర్శిగా చిన్న పీరయ్య, సంయుక్త కార్యదర్శులుగా పి.మస్తాన్ సాహెబ్, మహబూబ్‌బాష, కోశాధికారిగా సిద్దయ్య, మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజకిషోర్‌బాబు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఐక్యంగా ముందు వెళతామని తెలిపారు.

లివర్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ, చెన్నై చీఫ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న చీఫ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై వారి ఆధ్వర్యంలో డాక్టర్ దినేష్ ఆసుపత్రి సహకారంతో సుపర్ స్పెషాలిటీ అడ్వాన్స్ లివర్ క్లినిక్ ప్రారంభించామని గ్లోబల్ ఆసుపత్రి చీఫ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డాక్టర్ దినేష్‌రెడ్డి సౌజన్యంతో అధునాతన సూపర్ స్పెషాలిటీ లివర్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి 4వ శనివారం కడపలో గ్లోబల్ ఆసుపత్రి వైద్య కడపలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. లివర్ వ్యాధి లక్షణాలు గుర్తించాలంటే పచ్చకామెర్లు రావడం, రక్తపు వాంతులు కావడం చోటుచేసుకుంటాయని తెలిపారు. ఆసుపత్రి వైస్ చైర్మన్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎపి ప్రభుత్వ సహాయ సహకారాలతో లివర్ వ్యాధి బారిన పడిన రోగులకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయం అందజేస్తున్నారని తెలిపారు. నాగరాజుపేటలో ఉన్న దినేష్ ఆసుపత్రిలో లివర్‌కు సంబంధించి చెన్నై ఆసుపత్రి వైద్యలు అందుబాటులో ఉంటారని చెప్పారు. పెద్ద ఆసుపత్రి ఖర్చు ఎక్కువ అనుకునే పేదలకు సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ కడపలో పరీక్షలు చేయించుకోవడం తమ క్లినిక్‌లో లివర్ ట్రాన్స్‌యాక్షన్ పరీక్షలు చేస్తారని చెప్పారు. రోగి ఇమాయ్ బాష మాట్లాడుతూ తాను వైసిపిలో ఉన్నానని దాదాపు రూ.68లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్ చెప్పారన్నారు. సిఎం రిలీఫ్ ఫౌండ్ నుంచి మొత్తం అమౌంట్ వచ్చిందని తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పోరుమామిళ్ల



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని రంగ సముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో దంత వైద్య సేవల విభాగం ప్రారంభించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష లు నిర్వహించి మందులతో పాటు డెంటల్ కిట్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ బద్వేల్ శ్రీ సాయి దంత వైద్యశాల వైద్యులు ప్రతి ఆది, బుధ, శుక్రవారాల్లో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తమ సేవలను అందిస్తారని వీరంతా వివిధ విభాగాలలో ఎండిఎస్ చేసిన వైద్యులని చెప్పారు. వీరి సేవలను పోరుమామిళ్ల చుట్టుపక్క ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎలిచెర్ల సాయినాథ్ రెడ్డి , శోభిత రెడ్డి, ఎలిచెర్ల నిహారిక రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి , ప్రజల రెడ్డి, ఆరోగ్యారాణి, చిత్తా రాజరెడ్డి, మాజీ ఎంపిటిసి రోసిలీనా పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు 'బీరం' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప మున్సిపల్ మైదానంలో డిఎస్ఎ ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ఐ నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ అండర్-17 విభాగంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.మధు, అండర్-14 విభాగంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న గౌతమ్ అనే విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించి, తమ సంస్థ సాధిస్తున్న వరుస విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ విద్యా సంస్థను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కుష్టు వ్యాధిని పారదోలుదాం.. కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరిద్దామని వైద్యాధికారి డాక్టర్ జి.హనీఫ్ బాబా పేర్కొన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిపిఎంఒ శ్రీనివాసులు, హెచ్ఇ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, సిహెచ్ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.


సిబ్బందికి సర్వే నమూనా పత్రాలు అందిస్తున్న డాక్టర్

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గార్మీ పండగ సందర్భంగా అంజుమన్ అధ్యక్షుడు వి.ఎస్.ముక్తియార్ ఆదివారం విభిన్నప్రతిభావంతులకు, వృద్ధులకు, అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ చేశారు. పండ్ల వ్యాపారి ఖాదర్‌వలి ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి గార్మీ సందర్భంగా జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించి, భోజనాలు ఏర్పాటు చేశారు. కుల మతాలకతీతంగా దుప్పట్లు అందజేసి మాన వత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఆఫ్ యు దివ్యాంగుల సంఘం నేత దొడియం అప్జల్, చలపతిరావు మాట్లాడుతూ దాతలను అభినందించారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ముక్తియార్

రెడ్డి కమ్యూనిటీ కన్వీనర్‌గా చింతా సుమంత్‌రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

రెడ్డి కమ్యూనిటీ జమ్మలమడుగు నియోజకవర్గం కన్వీనర్‌గా కొండాపురం మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన చింతా సుమంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రెడ్డి కుటుంబాల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. తనను ఎన్నుకునేందుకు సహకరించిన అధ్యక్షులు యర్రపరెడ్డి సురేంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

చిన్నమండెం : మాజీ ఎమ్మెల్యే, రాయచోటి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై కేసులు బనాయించడం పిరికిపంద చర్య అని, వెంటనే అక్రమ కేసులు ఎత్తి వేయాలని టిడిపి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రమేష్ కుమార్ రెడ్డి కుటుంబం చాలా విలువలతో కూడుకున్న రాజకీయ కుటుంబమని చెప్పారు. లక్కిరెడ్డిపల్లిలోని మైనార్టీల శ్మశానానికి సొంత భూమిని కేటాయించి తన మానవత్వాన్ని చాటుకున్న మహానుభావుడు రమేష్ రెడ్డి అన్నారు. రమేష్ రెడ్డి రాజకీయ జీవితం ఎంతో హుందాతో నడిచిందని అలాగే నడుస్తూ ఉంటుందని తెలియజేశారు. రాజకీయంగా ఎదుర్కొనలేక వైసిపి వారు తప్పుడు కేసులు బనాయించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఇరు గ్రూపుల వారు ఘర్షణలు పడుతూ ఉంటే ఆయన దృష్టికి రావడంతో ఒక పెద్ద మనిషిగా వెళ్లి వారి సద్ది జెప్పి రావడం నేరమా అని ప్రశ్నించారు. తప్పుడు కేసులను ఎత్తివేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

మానవత సేవలు ఆదర్శనీయం


రాయచోటి : మానవత సేవలు ఆదర్శనీయమని విజయలక్ష్మీ జువెలర్స్ దుకాణం యజమాని సుగవాసి జానకి రామ్, సుగవాసి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మాసాపేట లోని కీ.శే. సుగవాసి నారాయణ స్వామి, విజయలక్ష్మి జ్ఞాపకార్థం కౌన్సలర్ ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి మురళీ దిగువ అబ్బవరం వైసిపి నాయకులు తిరుపాల్ నాయుడతో కలిసి మానవత రాయచోటిశాఖ చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, అధ్యక్షులు కనపర్తి శివశంకర్ రెడ్డి,సెక్రెటరీ రామానాయుడు బాడీఫ్రీజర్ అందజేశారు.

ఎలక్ట్రికల్ బైక్‌ల్లో దూసుకుపోతున్న 'ఒకాయా'

- మేనేజింగ్ పార్టనర్ పి.వి.వంశీకృష్ణ నాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలో అత్యధికంగా దూసుకుపోతున్న ఎలక్ట్రికల్ బైక్ ఒకాయా అని శ్రీ ఆటో మోటివ్స్ మేజింగ్ పార్టనల్ పి.వి.వంశీకృష్ణ నాయుడు అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఒకాయి ఎలక్ట్రికల్ బైక్ మూడు మోడల్స్‌లో లభిస్తున్నాయని తెలిపారు. ఫాస్ట్ ఎఫ్4, ఫాస్ట్ ఎఫ్2బి, క్లాసిక్ ఉన్నాయని పేర్కొన్నారు. ఫాస్ట్-150 కిలోమీటర్ రేంజ్ ఉందన్నారు. ఎల్ఎఫ్‌పి బ్యాటరీతో కూడిన వాహనం కావడంతో బ్యాటరీ పేలుడు అన్న సమస్య లేదన్నారు. ఒకాయా ఎలక్ట్రికల్ బైక్‌ను బ్యాటరీ రంగంలో 35 సంవత్సరాలుగా అనుభవం ఉన్న వారు తయారు చేశారని పేర్కొన్నారు. దాదాపు 2వేల సైకిల్స్ లైఫ్ వరకు బ్యాటరీ ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నవాటికంటే రెండు రెట్లు అదనంగా లైఫ్ ఇస్తుందన్నారు. కంపెనీ వారు 3 సంవత్సరాలు వారంటీ కూడా ఇస్తున్నారని తెలిపారు. ఎఫ్4 70 కిలోమీర్ పర్ అవర్ స్పీడ్‌తో ఉంటుందని పేర్కొన్నారు. గాట్ రోడ్‌పై ఇద్దరు వ్యక్తులు వెళ్లేందుకు వీలుందన్నారు. వాహనాలు అవసరమైన వారు కో-ఆపరేటివ్ కాలనీలోని నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న శ్రీ ఆటోమోటివ్స్, ఒకాయాలో సంప్రదించాలని కోరారు.





'పేదల అభ్యున్నతే శ్రీగాయత్రి సేవా ట్రస్ట్ లక్ష్యం'


పుస్తకాలు అందజేస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సంస్థ సభ్యులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం యల్లంపల్లె గ్రామానికి చెందిన నిగినే వెంకటేశ్వర్లు చిన్నతనం నుండే సేవా గుణాన్ని అలవర్చుకొని 1999 నుండి సమాజానికి తనవంతుగా సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నారు. శ్రీగాయత్రి సేవా ట్రస్ట్‌ను కటారి బ్రహ్మయ్య అనే స్నేహితుని సహకారంతో నెలకొల్పి 2007 నుండి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వృత్తిరీత్యా వీరు ఇరువురు అధ్యాపకులు. అనేకమంది విద్యార్థులతో పరిచయం ఉండడం వల్ల వారి సమస్యలు తెలుసుకుని వారికి కావలిసిన పాఠ్య పుస్తకాలు, కళాశాల ఫీజులు, పరీక్ష ఫీజులు, బస్సు పాసులు తదితర అవసరాలు తీర్చడంతో సేవ ప్రారంభించారు. పేద విద్యార్థులను గుర్తించి వారికి సాయం చేసేవారు. సహాయం పొందిన విద్యార్థులతోనే వారి గ్రామ, పట్టణ, పరిసరాల్లో నిరుపేదలను, ఒంటరి మహిళలను, పురుషులును, వికలాంగులను గుర్తించి వారికీ అవసరమైన బియ్యాన్ని, నిత్యావసర వస్తువులును ఇవ్వడం, ఆరోగ్య పరీక్షలకు కొంత ఆర్థికసాయం చేయడం ప్రారంభించారు. తర్వాత స్వయంగా గ్రామాలకు, మారుమూల వాడలకు వెళ్లి అనారోగ్య బాధితులు, దీర్ఘ కాలిక వ్యాధులు అయిన క్యాన్సర్, కిడ్నీతో బాధ పడేవారికి ఆర్థికసాయం చేస్తున్నారు. 2017 నుండి పూర్తి సమయం సేవా కార్యక్రమాలకే వినియోగిస్తున్నారు. నిరుపేద కుటుంబం, నిరుపేద విద్యార్థులు, అనాథలున్నా వారికి సాయం చేయడానికి తమ ట్రస్ట్ ఉందనే విషయం గుర్తుకు రావడమే లక్ష్యంగా 2019న అధికారంగా ట్రస్ట్‌ను రిజిస్టర్ చేపించారు. 2019 నుండి 86మంది విద్యార్థులను దత్తత తీసుకొని వారికి కావాల్సిన బట్టలు, పుస్తకాలు, వ్యక్తి గతమైన వస్తువులు, ఏవిధంగా వారి ఉన్నతికి అవసరమైనా శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ చూసుకుంటుంది. 2020 కరోనా సమయంలో 200 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేసింది. లాక్‌డౌన్ సమయంలో మాస్కులు పంచడం, బాటసారులకు, యాచాకులకు భోజనాలు అందించారు. కడప జిల్లా వ్యాప్తంగా 1500 మంది ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూర్బా, గురుకుల విద్యాలయాల్లోని పదవ తరగతి విద్యార్థులకు మెటీరియల్, పరీక్ష సామగ్రి అందిస్తూ వస్తున్నారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి , ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి, మెటీరియల్స్‌ను దాదాపు 1100మందికి పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పేదల సేవ కోసమే ట్రస్ట్ నిర్వహణ



తల్లిదండ్రులు, భార్య పిల్లలు, మిత్రుడు మా పెద్దన్నయ్య కూనపురి రాము, కటారి బ్రహ్మయ్య, నా ట్రస్ట్ సేవల్లో గంగా భవానీ, దొరబాబు, శివశంకర్, సంతోష్, నారాయణ, నరసింహ, గోపి, సుబ్బారాయుడు, గురుమోహన్ కార్య క్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. వారి అందరి సహాయ సహకారాలు మరువలేనివి. ఇలాగే భవిష్యత్‌లో అనాథ, బాల, వృద్ధ, నిరా శ్రయులకు ఆశ్రమం నెలకొల్పి వారికి సేవ చేస్తూ గోశాల, వేద పాఠశాల, గాయత్రి మాత మందిరం నెలకొల్పడమే జీవిత ఆశయం.

- ఎన్ వెంకటేశ్వర నాయుడు, ట్రస్ట్ చైర్మన్

బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు

వరి పొలానికి పురుగుల మందు పిచికారి చేస్తూ విద్యుదాఘాతానికి గురై మండల పరిధిలోని చియ్యపాడు గ్రామానికి ముగ్గురు రైతులు, కమలాపురం వద్ద ఆ గ్రామ ఎస్‌సి కాలనీకి చెందిన మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో జి.రాంబాబు మృతి చెందిన విషయం విదితమే. ఆయా దుర్ఘటనల్లో ఇంటి పెద్ది దిక్కును కోల్పోయిన ఆ నాలుగు కుటుంబాలకు ఆదివారం మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇరగంరెడ్డి కార్తిక్‌రెడ్డి ఆర్థికసాయం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.25వేలు ప్రకారం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పెద్దిరెడ్డి బాలఓబుల్ రెడ్డి, బొమ్ము మల్లిఖార్జున్‌రెడ్డి రాంబాబు కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాంబాబు కుటుంబ పరిస్థితి ఏమాత్రం సరిగా లేకపోవడంతో వారి ఇంటి నిర్మాణానికి, 10వ తరగతి చదువుతున్న అతని కుమార్తె ఉన్నత చదువులకు తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. మృతి చెందిన రైతుల కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా, తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్, గ్రామ నాయకులు రాజేంద్రనాథ్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, కర్ణా, కార్తిక్‌రెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కార్తిక్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

వారం గడిచినా ఎలాంటి న్యాయం జరగలేదని కుటుంబ సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట పెద్దకోన మలుపు దగ్గర గత ఆదివారం (ఈ నెల 6న) రాత్రి గండికోట నుంచి జమ్మలమడుగు వైపుగా వెళుతునన ఇన్నోవా ఎపి27 బిబి 2628 కారు, తిరుమల దైవ దర్శనానికి వెళ్లి తిరిగి గండికోటకు వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ తిమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన మెరుగు రామలక్షుమ్మ (54)ను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందింది. ఇన్నోవా కారు డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంగా ఆటోను ఢీ కొట్టడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని మృతురాలి నలుగురు కూతుళ్లు కన్నీటి పర్యంతమయ్యారు. మతురాలు కుటుంబంలో అన్ని వ్యవహారాలు చూసుకొనేది. భర్త తాగుడుకు బానిసై ఉండగా కుటుంబ భారం అంతా ఆమె మోసేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తిరుపతిలో వారం రోజులుగా రూ.3.50 లక్షలు అప్పు చేసి వైద్యం అందించినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. గ్రామ సర్పంచు కె.గురుఈశ్వర్, గ్రామంలోని శివ కృష్ణ, శంకర్ రామలక్షుమ్మ అంత్యక్రియలకు సహకరించారు. మృతురాలి పెద్ద కుమార్తె బాలగురమ్మ ఫిర్యాదు మేరకు సిఐ సదాశివయ్య కేసు నమోదు చేశారు.


రామలక్షుమ్మ (ఫైల్‌ఫొటో)

30న కడపలో ఆవాజ్ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న ఆవాజ్ కడప జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆవాజ్ జిల్లా 4వ మహాసభలు ఈనెల 30న కడప నగరంలో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆవాజ్ కడప జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తెలిపారు. మహాసభలకు ముఖ్యఅతిథులుగా ఆవాజ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎంఎ గఫూర్, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎంఎ చిష్టి హాజరవుతారని తెలిపారు. రూరల్ పరిధిలోని అమృత్‌నగర్‌లో ఆదివారం ఆవాజ్ కమిటీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చాంద్‌బాషా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటి పరిష్కారం కోసం 20ఏళ్ళుగా ఆవాజ్ కమిటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివద్ధి లేదన్నారు. ముస్లింల పట్ల నల్ల చట్టాలు తెచ్చి తగాదాలు పెడుతోందన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నిరుపేదలు నివసిస్తున్న ముస్లింల ఇళ్లను కూలుస్తూ వారిని భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశం.. ఈ దేశంలో అందరూ సమానమే అని అన్నారు. ఎపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల వాగ్దానంలో ముస్లింలకు ఎన్నో హామీలిచ్చినా, అవి అమలు కాలేదని విమర్శించారు. ఆవాజ్ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్, ప్రొద్దుటూరు కన్వీనర్ ఎస్.మహబూబ్ బాషా, ఆవాజ్ నాయకులు అబ్దుల్, రెహమాన్, జాఫర్, సాదక్, మహబూబ్ బాషా, ఇమామ్ హుస్సేన్, సాదక్‌వలి, అబ్దుల్లా, మౌలాలి పాల్గొన్నారు.

మోడీ పర్యటనతో రాష్ట్రానికి ఒరిగిందేమీలేదు?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనతో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీలేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా ఉత్తుత్తి పర్యటన చేసి వెళ్లిన మోడీ తీరును నిరసిస్తూ ఆదివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహం వద్ద వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మోడీ విశాఖ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యమైన ప్రత్యేకహోదా, కడప ఉక్కు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్యాకేజీల గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. విభజన హామీల్లో స్పష్టంగా ప్రత్యేకహోదా, కడప ఉక్కు ఉందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు విభజన హామీలు అమలుపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం ప్రశ్నించే వాళ్లను కూడా అడగనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మా ర్గంగా అరెస్టులు చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఇమామ్, నరేంద్ర, శ్రీనివాసులు, కరిముల్లా పాల్గొన్నారు.



జమ్మలమడుగులో చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

వేంపల్లె : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటన ప్రజలకు నిరాశను మిగిల్చిందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి తెలిపారు. 'పుల్లన్న పులివెందుల సంతకు పోనూ పోయాడు.. రానూ వచ్చాడు వట్టి చేతులతో ' అన్నట్లు ఉంది మోడీ పర్యటన అని ఎద్దేవా చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన పర్యటనలో మోడీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయం తీసుకరాలేదన్నారు. బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం, రాజధానికి నిధులు, పోలవరానికి నిధులు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ మెట్రో రైలు, విజయవాడ మెట్రో రైలు, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ గురించి మాట వరసకు కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. మోడీ పర్యటనలో కాకా రెడ్డిగా జగన్ నిరూపించుకున్నారని తెలిపారు. అధికారంలోకి రాక ముందు కేంద్రం మెడలు వంచి ప్రత్యేకహోదా సాధించడంతోపాటు చట్టంలోని అన్ని అంశాలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ప్రధాని ముందు మెడలు వంచి అభ్యర్థించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తమ మధ్య బంధం రాజకీయాలకు అతీతమని చెప్పడం ద్వారా వ్యక్తిగత కేసులు నుండి బయట పడేయమని వేడుకొన్నట్లు ఉందన్నారు. ప్రత్యేకహోదా రావా లన్నా, విభజన చట్టంలోని అంశాలు అమలు కావాలన్నా కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రొద్దుటూరు : విభజన హామీల ప్రస్తావనే లేకపోవడంతో ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన నిరాశతో ముగిసిందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో నటన తప్ప ఏమీలేదన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బిజెపి చేతిలో కీలుబొమ్మలని తేలిపోయిందన్నారు.

పేదవాని ఇంటి కల నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌దే

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పేదవాని ఇంటి కలను నెరవేర్చిన ఘనత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పురపాలక చైర్మన్ వరప్రసాద్, ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ హాల్ గంగాధర, వైస్ చైర్మన్ హఫీజ్ పేర్కొన్నారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల ఇళ్లను, స్థానిక పాత అర్బన్ ఫేజ్-వన్, టు.. వైఎస్ఆర్ గ్రామీణ తదితర పథకాల కింద నిర్మాణం చేసి ప్రజలకు ఇచ్చారని, త్వరలో మరో తొమ్మిది లక్షల ఇళ్లను కూడా దశలవారీగా ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. కొన్ని నియోజకవరాల్లో కోర్టు కేసులు ఉండడం వల్ల జాప్యం జరిగిందే తప్ప మరొకటి కాదన్నారు. అన్ని కేసులు పరిష్కారం అయ్యాయని, ప్రతి అక్క చెల్లెమ్మ చేతికి పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి వారి చేతిలో పెట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 254 చదరపు అడుగులు ఇస్తే జగనన్న 340 చదరపు అడుగులలో ఇంటి విస్తీర్ణం ఇచ్చారన్నారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తుంటే.. మతిస్థిమితం లేనివిధంగా జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేయడం విడ్డూరమన్నారు. గతంలో చంద్రబాబు పక్కా ఇళ్లు ఇస్తానని, కట్టకపోయినా ఏనాడైనా పవన్‌కళ్యాణ్ ప్రశ్నించారా అని పేర్కొన్నారు. సామాజిక స్పృహ ఉన్న వారు పవన్‌కళ్యాణ్, టిడిపి నాటకాలను గ్రహించి వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, సిద్దయ్య, వీర, నారాయణస్వామి, రసూల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు 55వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించడం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 17న చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు, 18న సెమినార్స్, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇందిరా గాంధీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు వివరించారు. అలాగే 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఫోర్జరీ చేయలేదనడం శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచు నామినేషన్‌లో వైసిపి నాయకులు ఫోర్జరీ సంతకాలు చేసి చేయలేదనడం శోచనీయమని టిడిపి కడప పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షుడు మేదర రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాసరి రమాదేవి సంతకం ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి రిపోర్టు రాకముందే ఫోర్జరీ సంతకం కాదు అని వైసిపి నాయకులు ఎలా నిరూపిస్తారని అన్నారు. నామినేషన్ల పత్రంలో దాసరి రమాదేవినే సంతకం చేసిందని చెప్పడం నీతి మాలినచర్యగా వారు పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత దాసరి రమాదేవి గ్రామంలోనే లేదని చెప్పారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు రామచంద్ర, శీను, మల్లికార్జున యుగంధర్, దేవేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌టి సెల్ అధ్యక్షుడు మేదర రవికుమార్

బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక సంఘం వీధిలో ఉన్న గౌరిదేవి ప్రసాదాన్ని బలిజ సంఘం నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్తీక మాస గౌరిదేవి ఉత్సవాలను బలిజ సంఘం నాయకులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గౌరిదేవి బలిజ సంఘం అధ్యక్షులు కటిక చంద్రశేఖర్, నంబూరు కుళాయప్ప ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న వారికి ఇంటింటికి వెళ్లి లడ్డూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలిజసంఘం సభ్యులు రమేష్ బాబు, శివయ్య, పద్మా రాజ్‌కుమార్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి మైదు కూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలో అడు గుపెట్టాలనే తలంపుతో మాజీ సర్పంచు, న్యాయవాది బి.ఎన్.శ్రీనువాసులు ఆధ్వర్యంలో యువత చేపట్టిన తిరుమలకు పాదయాత్రకు ఆదివారం నందలూరు వద్ద ఆపార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మేకల సుదర్శన్ యాదవ్, నారప రెడ్డి, రాము పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న టిడిపి నేతలు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్‌కె డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యంలో డాన్స్ మాస్టర్ శ్రావణ్, చిట్టి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలో చిన్నారులు

16 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటి : చెన్న ముక్కపల్లె ఉన్న లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆది వారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 16 మందికి ఆపరేషన్లు చేశారు. రాయచోటి నియోజక వర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, కె.వి. పల్లె, యర్రావారి పాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వ హించిచారు.